క్లుప్తంగా

బస్సు సర్వీసును పునరుద్ధరించాలని వినతి

'ప్రజాపాలన'లో తహసీల్దార్‌కు అభ్యర్థన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కందుకూరు: ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ వాసులు బుధవారం గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. కరోనా సమయంలో తమ గ్రామానికి మహాత్మాగాంధీ బస్ డిపో నుంచి ముచ్చర్ల మీదుగా బస్సు సర్వీసు కొనసాగేదన్నారు. ప్రస్తుతం ఆ సర్వీసు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు చొరవచూపి బస్సు సర్వీసు కల్పించాలని కోరారు.

ఇంటింటికీ శ్రీరాముని అక్షితలు



చైతన్యనగర్ కాలనీలో అక్షితలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: త్వరలో అయోధ్య శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఇంటింటికీ శ్రీరాముని అక్షితలు పంపిణీ చేస్తున్నామని బీఎన్ రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీలో బుధవారం శ్రీరాముని అక్షితల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామ మందిరం ప్రారంభం సందర్భంగా వాడ వాడలా శ్రీరాముని అక్షితలతో పాటు రామలీల చిత్రపటం, ఆహ్వాన పత్రికను భక్తులందరికీ పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, సాయిబాబాగుడి చైర్మన్ రాంరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, వేణుగోపాల్‌రావు, నర్సింహారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మల్లేష్, సుధాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డికి సన్మానం



మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్, కవాడిపల్లి, ఇనాంగూడ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపూడి కార్యక్రమాల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రంగారెడ్డిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి . మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ బుర్ర రేఖ, జెడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు యశోద, సుజాత, చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కొత్తపల్లి జైపాల్ రెడ్డిలతోపాటు గురుస్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం

ఎమ్మెల్యే నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని, ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మాడ్గుల మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అలాగే మాడ్గుల మండల కేంద్రంలో రైతువేదిక భవనంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. అర్హులందరూ ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

సావిత్రిబాయి సేవలు మరువలేనివి



కందుకూరు: మీర్‌ఖాన్‌పేటలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



హుడాకాంప్లెక్స్: జింకలబావి కాలనీలో సావిత్రి బాయి విగ్రహం వద్ద నేతలు

- పూలే ఆశయాలను కొనసాగించాలి
- జయంతి సందర్భంగా స్మరించుకున్న ఉపాధ్యాయులు

కందుకూరు: సావిత్రిబాయి పూలే ఆశయాలను ప్రతి ఒక్కరు ముందుకు తీసుకుపోవాలని మండలంలోని మీర్‌ఖాన్‌పేట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్‌రెడ్డి, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహా కోరారు. బుధవారం మీర్‌ఖాన్‌పేట జెడ్పీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భర్త జ్యోతిరావు పూలే సహకారంతో చదివి దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సేవలందించారని కొనియాడారు. బాలికలు, మహిళల సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, శ్రీనివాస్, హరిప్రసాద్, అనిల్, రాంచందర్, నరోత్తంరెడ్డి, సుచరిత, భాగ్యలక్ష్మి, మంగ, యదీశ్వర్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిలు, వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

గూడూరులో..

కాళోజీ మానవ హక్కుల క్లబ్ ఆధ్వర్యంలో గూడూరు జిల్లా పరిషత్ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిషన్, ఉపాధ్యాయులు ఎండీ ఆయూబ్, ఎండీ బషీర్, మృణాళిని, క్లబ్ ప్రెసిడెంట్ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట కూడలిలో..

మీర్‌పేట: నిమ్న వర్గాల అభ్యున్నతి, మహిళా విద్యాభివృద్ధి కోసం సావిత్రిబాయి పూలే ఎనలేని కృషి చేశారని మీర్‌పేట కార్పొరేషన్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దాసరి బాబు గుర్తు చేశారు. బుధవారం ఆమె జయంతి సందర్భంగా మీర్‌పేట కూడలిలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం నాయకులు రఘు, రాములు, నాగరాజు, ఉమేష్, దయాకర్, రవి, ప్రభాకర్, రాకేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు అరవింద్, దేవేందర్ పాల్గొన్నారు.

జింకలబావి కాలనీ చౌరస్తాలో

హుడాకాంప్లెక్స్: చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని బుధవారం సరూర్‌నగర్ మండల కేంద్రంలోని జింకలబావి కాలనీ చౌరస్తాలో మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం జాతికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు ఆనంద్‌కుమార్‌గౌడ్, అరవింద్ కుమార్, కబీర్దాస్‌గౌడ్, లోకేశ్, కల్పన, వెంకటేశ్వర్లు, వెంకటేష్‌గౌడ్, రాకేష్‌గౌడ్ పాల్గొన్నారు.



మీర్‌పేట: కూడలిలో నినాదాలు చేస్తున్న బాబు తదితరులు



కందుకూరు: గూడూరులో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మేయర్‌కు సీతారాముల అక్షితలు



మేయర్‌కు అక్షితలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతరెడ్డికి అయోధ్య ట్రస్ట్ సభ్యులు సీతారాముల అక్షితలు బుధవారం అందచేశారు. కార్యక్రమంలో భూషణ్‌జీ, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్, సమరసింహారెడ్డి తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అప్పులు

కాంగ్రెస్ నాయకుడు కప్పాటి పాండురంగారెడ్డి



కందుకూరు: రెండు పర్యాయాలు పాలించిన బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి భ్రష్టు పట్టించిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు అంటూ ఆరోపణలు చేసే బీఆర్‌ఎస్ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఎన్నో ఉద్యమాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, ఎన్నో ఆశలు, ఆకాంక్షల మధ్య ఉద్యమ పార్టీ నాయకుడిగా కేసీఆర్‌కు అధికారం అప్పగిస్తే మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని లోటు బడ్జెట్‌గా మార్చారన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెల రోజులు గడవకముందే ప్రజాపాలన పేరుతో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే, తట్టుకోలేక బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.

దేవాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో పోచమ్మ దేవాలయం పునర్నిర్మాణం కోసం మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్‌రెడ్డి దంపతులు ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం ఆలయం వద్ద దయాకర్‌రెడ్డి శంకుస్థాపన చేసి రూ.1 లక్షా 50 వేలను కమిటీ సభ్యులకు ఇచ్చారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో మాజీ కార్పొరేటర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు ఎల్లయ్యయాదవ్, నర్సింహాగౌడ్, మల్లేశ్, రాంచందర్, దుర్గయ్య, భాస్కర్, యాదగిరి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు రాఘవేంద్ర గుప్తా పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న దయాకర్‌రెడ్డి

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



మీర్‌పేట: పడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి



మహేశ్వరం: ఇరుముడి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

- పెండ్యాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రత్యేక పూజలు
- శివగంగా ఆలయంలో ఇరుముడి పూజలో మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: అయ్యప్ప నామస్మరణతో ఆ గ్రామం మార్మోగింది. బుధవారం మండల పరిధిలోని పెండ్యాల గ్రామంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మంత్రి రాజేష్ అయ్యప్ప మహాపడి పూజను నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి గీతాలు ఆలపించారు. ఈ పూజకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంత్రి సంధ్య అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు థామస్‌రెడ్డి, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, లింగంముదిరాజ్, రాములునాయక్, పోతుల నర్సింగ్ పాల్గొన్నారు.

శబరిమల యాత్ర..

మహేశ్వరం:మండల కేంద్రంలోని శ్రీశివగంగా రాజరాజేశ్వర ఆలయంలో అయ్యప్ప మహాపడి, ఇరుముడుల పూజ కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప భక్తులు ఇరుముడులు తలపైన పెట్టుకొని శబరిమలకు బయలుదేరారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాతరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనుల పండువగా పడిపూజ..

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి చింతలకుంటలో 12వ డివిజన్ కార్పొరేటర్ ఇంద్రావత్ రవినాయక్ ఆధ్వర్యంలో శ్రీఅయ్యప్పస్వామి మహాపడిపూజ మహోత్సవాన్ని బుధవారం కనుల పండువగా నిర్వహించారు. పడిపూజకు ఎమ్మెల్యే సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, కార్పొరేటర్లు భూపాల్‌రెడ్డి, అనిల్‌యాదవ్, లావణ్య, శ్రీనునాయక్, భూపేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కాల్వ పనులు అడ్డగింత



పనులు అడ్డుకున్న కాలనీవాసులు

- జేసీబీ ఎదుట బైఠాయించిన కాలనీవాసులు
- అభివృద్ధి పనులు ఆపొద్దన్న అధికారులు
- సాయి ప్రభుహోమ్స్ కాలనీలో ఘర్షణ వాతావరణం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్ సాయి ప్రభు హోమ్స్ కాలనీలో ప్రధాన రోడ్డును అధికారులు పనుల నిమిత్తం తవ్వుతుండగా బుధవారం కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ రహదారిని వర్షపు నీరు వెళ్లే కాల్వ నిర్మాణం కోసం తొలగిస్తుండగా కాలనీవాసులు జేసీబీకి అడ్డంగా కూర్చుని నిరసన తెలిపారు. మున్సిపల్ అధికారిణి అనురాధ వారితో మాట్లాడుతుండగా వాగ్వాదం చోటు చేసుకుంది. వెంటనే పోలీసుల జోక్యంతో ఆందోళనకారులు శాంతించారు. ఈ సందర్భంగా మేయర్, స్థానిక కార్పొరేటర్‌తో మాట్లాడుతామని మూడు రోజులు సమయం కావాలని కాలనీవాసులు కోరగా అధికారులు అంగీకరించి అక్కడ నుంచి వెళ్లిపోయారు. కాలనీ ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ.. రోడ్డు చిన్నదిగా ఉందన్నారు. కేవలం 15 ఫీట్లు ఉండడంతో వర్షపు నీరు వెళ్లే కాల్వ నిర్మిస్తే రోడ్డంతా దెబ్బతింటుందన్నారు. అందుకు వేరే మార్గం చూడాలని అధికారులకు చాలా సార్లు విన్నవించామన్నారు. అయినా వారు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పోలీసులను పిలిపించి కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు న్యాయం జరిగే వరకు పనులు నిలిపివేయాలని కోరారు.

9న మండల సర్వసభ్య సమావేశం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అనిత విజయ్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఆలయాభివృద్ధికి కృషి

తలకొండపల్లి: ఆలయాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని కొర్కిరాల తండాలో తుల్జా భవాని ఆలయ నిర్మిస్తున్నారు. బుధవారం ఆలయ నిర్మాణానికి స్టీల్, సిమెంట్, మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో రవి, హరికిషన్, గోపాల్, శ్రీను, శంకర్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు విజ్ఞప్తి

యాచారం: మొండిగౌరెల్లి గ్రామంలోని సర్వే నంబరు 19లో ఓ వ్యాపారి గ్రామస్తులను భయపెట్టి స్టోన్ క్రషర్, క్వారీ పెట్టాలని ప్రయత్నిస్తున్నాడని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ తెలిపారు. ఎమ్మెల్యే రంగారెడ్డి తక్షణమే మైనింగ్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి స్టోన్ క్రషర్, క్వారీ పెట్టకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. నిర్మాణాలను అడ్డుకున్న గ్రామస్తులపై వ్యాపారి కేసులు పెట్టారని తెలిపారు. క్వారీ నిర్మాణానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని రవీందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మరిపల్లి సోమశేఖర్, చెన్నారెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



క్వారీ నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రవీందర్ తదితరులు

ఆన్‌లైన్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



లిటిల్ ల్యాంబ్ చర్చిలో దుస్తులు పంపిణీ చేసిన ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి, చర్చి ప్రతినిధులు

వనస్థలిపురం: రోజు రోజుకూ పెరుగుతున్న ఆన్‌లైన్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, అలాగే మైనర్లు వాహనాలు నడపకుండా పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు ప్రభుత్వం పంపించిన దుస్తులను మంగళవారం రాత్రి వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చిలో పంపిణీ చేశారు. ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్థానికంగా ఉన్న 14 చర్చీలకు సంబంధించిన సభ్యులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రాథోడ్, పాస్టర్ రెవరెండ్ డాక్టర్ సుదర్శన్‌రావు, చర్చి కమిటీ అధ్యక్షుడు టీఎస్ బాబూరావు, కార్యదర్శి ఎస్.జాన్, కోశాధికారి ఎం.సురేష్‌కుమార్, ఏలియా, రాజు, ఎస్.జాన్, నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోండి

ఎంపీడీఓ ఫారూక్ హుస్సేన్



దరఖాస్తులు స్వీకరిస్తున్న సర్పంచ్ శ్రీనునాయక్

ఆమనగల్లు: సంక్షేమ పథకాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్ కోరారు. ఆమనగల్లు మండలంలో ప్రజాపాలన గ్రామసభలు కొనసాగుతున్నాయి. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని రాంనుంతల, కోనాపూర్ గ్రామాలలో సర్పంచ్‌లు సోన శ్రీనునాయక్, కడారి మల్లమ్మల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామసభలలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామసభల్లో రాంనుంతల నుంచి 174, కోనాపూర్ నుంచి 300 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సరిత పంతునాయక్, విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్, ఏఈ సీతారాం, పీఆర్ఏఈ కృష్ణయ్య, ఎంపీఓ శ్రీలత, నాయకులు శ్రీనునాయక్, పంతునాయక్, యాదయ్య, కృష్ణ, కమ్లి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

కడ్తాల్: క్రీడలతో మానసిక వికాసం పొందవచ్చని యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వివేకానంద యువజన సంఘం, యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని క్రీడపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, ఉప సర్పంచ్ రామకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు భాస్కర్‌రెడ్డి, చందోజీ, మాధవులు తదితరులు ఉన్నారు.

'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోండి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

ఎంపీడీఓ రామకృష్ణ

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన అభయహస్తం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ కోరారు. బుధవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి గ్రామ పంచాయితీలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించాలనే గొప్ప లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజాపాలన ద్వారా మహాలక్ష్మి పథకం, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్, ఉప సర్పంచ్ ఎల్లాగౌడ్ తదితరులు ఉన్నారు.